

సీఐ హిమగిరికి ఉత్తమ సేవ పతకం



సీఐ హిమగిరి

పాడేరురూరల్, మార్చి 22: జిల్లా స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎల్.హిమగిరి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ సేవ పతకానికి ఎంపికయ్యారు. పోలీసు శాఖలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ఉగాది సందర్భంగా సీఎం శౌర్య, మహోన్నత సేవ, ఉత్తమ సేవ, కఠిన సేవ పతకాలతో సత్కరిస్తున్నది. ఈ ఏడాది ఉత్తమ సేవ పతకానికి రాష్ట్ర వ్యాప్తంగా 35మంది ఎంపిక కాగా, అల్లూరి జిల్లా నుంచి సీఐ ఎల్.హిమగిరి ఒక్కరే వుండడం విశేషం.

పాడేరా?, పాలకొండా?

బీజేపీలో కొలిక్కిరాని సీటు వ్యవహారం

- తొలుత పాడేరు నుంచి పోటీ చేయాలని నిర్ణయం
- మరోమారు సమావేశమై పాలకొండ వైపు మొగ్గు
- కమలం అధిష్ఠానం కోర్టులో బాల్
- పాడేరు స్థానం తీసుకోవాలని తాజాగా నిర్ణయం?
- బీజేపీ పెద్దల ప్రకటన కోసం టీడీపీ నిరీక్షణ

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలోని పాడేరు, పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కూటమి తరపున టీడీపీ, బీజేపీల్లో ఏ పార్టీ, ఏ స్థానం నుంచి పోటీ చేస్తుందన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతున్నది. తొలుత పాడేరు సీటు తీసుకుంటామని చెప్పిన బీజేపీ నేతలు.. అంతర్గతంగా సమావేశం నిర్వహించుకుని పాడేరు కాకుండా పాలకొండ సీటు తీసుకుంటే బాగుంటుందని భావించారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి బీజేపీ అధిష్ఠానం ఇంతవరకు ఒక్క జాబితాను కూడా విడుదల చేయకపోవడంతో పాడేరు, పాలకొండ టికెట్ల వ్యవహారం ఒక కొలిక్కిరాలేదు.

అరకులోయ అసెంబ్లీ స్థానం పరిధిలో పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకులోయ, పాడేరు, రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలు వున్నాయి. ఎంపీతోపాటు అన్ని ఎమ్మెల్యే స్థానాలకు వైసీపీ ఈ నెల 16వ తేదీన అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. అదే విధంగా కూటమి (ఎన్‌డీఏ)లో టీడీపీ కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాలకు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించింది. కాగా పొత్తులో భాగంగా అరకులోయ పార్లమెంట్ స్థానం పరిధిలో ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని బీజేపీ కోరింది. రెండు వారాల క్రితం జరిగిన సమావేశంలో పాడేరు అసెంబ్లీ సీటు తీసుకోవాలని ఆ పార్టీ నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని టీడీపీ అధిష్ఠానానికి చెప్పి అంగీకారం పొందారు. అయితే బీజేపీ నేతలు ఇటీవల మరోమారు సమావేశం నిర్వహించుకుని, పాడేరు బదులు పాలకొండ స్థానం అయితే బాగుంటుందని భావించారు. ఈ విషయాన్ని టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లారు. కానీ కచ్చితంగా ఏ స్థానం తీసుకునేది స్పష్టం చేయలేదు. దీంతో పాడేరు, పాలకొండల్లో ఏ స్థానం నుంచి పోటీ చేయాలో బీజేపీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుని స్పష్టత ఇచ్చిన తర్వాతే మిగిలిన స్థానానికి అభ్యర్థిని ఎంపిక చేయాలని టీడీపీ భావిస్తున్నట్టు తెలిసింది. ఈ కారణంగానే టీడీపీ శుక్రవారం ప్రకటించిన మూడో జాబితాలో పాడేరు, పాలకొండ స్థానాల ప్రస్తావన రాలేదని తెలిసింది. పాలకొండ, పాడేరుల్లో ఏ స్థానం తీసుకోవాలన్న దానిపై బీజేపీ ఒక నిర్ణయానికి వస్తే, మిగిలిన స్థానానికి తమ అభ్యర్థిని ప్రకటించేందుకు టీడీపీ సిద్ధంగా ఉందని తెలిసింది. తాజా సమాచారం ప్రకారం పాలకొండ కన్నా పాడేరు స్థానంపైనే బీజేపీ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది.

రక్తమోడిన రహదారులు

జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- అనంతగిరి మండలం పాతకుడియా సమీపంలో వ్యాన్ బ్రేకులు ఫెయిల్
- లోయలోకి బోల్తా, ఒక కూలీ మృతి
- లంబసింగి ఘాట్‌లో లారీ బోల్తా
- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు
- అరకు సంతబయలు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

దేవరాపల్లి, మార్చి 22:

మండలానికి సమీపంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ పాతకుడియా సమీపంలో ధాన్యం లోడుతో వస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇద్దరికి తీవ్రగాయాలుగా మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి.



సంఘటన స్థలంలో చెల్లాచెదురుగా క్షతగాత్రులు, ధాన్యం బస్తాలు (ఇన్‌సెట్‌లో) మృతుడు దాసరి లక్ష్మణ (ఫైల్ ఫొటో)

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కాశీపురం గ్రామానికి చెందిన గంగరాజు అనే వ్యక్తి అనంతగిరి మండలంలోని సరసపాడు, చుట్టుపక్కల గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేశారు. తీసుకురావ డానికి అదే గ్రామానికి చెందిన దాసరి లక్ష్మణ(55), కొటాన సూర్య నారాయణ, గొంప మంగునాయుడుతోపాటు మొత్తం నలుగురు కూలీలను పురమాయించారు. వీరు శుక్రవారం తెల్లవారుజామున బొలేరో వాహనంలో సరసపాడు వెళ్లారు. ధాన్యాన్ని కాటా వేసి బస్తాల్లో నింపి, వ్యాన్‌లో లోడింగ్ చేసుకుని సాయంత్రం మూడు గంటల సమయంలో కాశీపురం బయలుదేరారు. పెదకోట పంచాయతీ పాతకుడియా సమీపంలోకి వచ్చేసరికి బ్రేకులు పనిచేయక వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దాసరి లక్ష్మణ, కొటాన సూర్యనారాయణ, గొంప మంగునాయుడుకు తీవ్రగాయాలయ్యాయి. వ్యాన్ డ్రైవర్ రవితోపాటు మరో కూలీకి స్వల్పగాయాలయ్యాయి. వీరిని ప్రైవేటు వాహనంలో పినకోట పీహెచ్‌సీకి తీసుకువస్తుండగా దారిలోనే లక్ష్మణ మృతిచెందాడు. క్షతగాత్రులకు పినకోట వైద్యాధికారి డి.రూప్‌చంద్, సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు పంపారు. ఈ ప్రమాదంపై దేవరాపల్లి ఎస్ఐ డి.నాగేంద్ర అనంతగిరి పోలీసులకు సమాచారం అందించారు.

లంబసింగి ఘాట్‌లో లారీ బోల్తా

- క్లీనర్ మృతి, డ్రైవర్‌కు తీవ్రగాయాలు



లంబసింగి ఘాట్‌లో బోల్తాపడిన లారీ

చింతపల్లి, మార్చి 22: మండలంలోని లంబసింగి ఘాట్ రోడ్డులో లారీ అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో లారీ క్లీనర్ మృతిచెందాడు. డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి డ్రైవర్, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన లారీ డ్రైవర్ కృష్ణంశెట్టి కొండలు రెండు రోజుల కిందట ఒడిశా రాష్ట్రం చిత్రకొండకు సిమెంట్ బస్తాల లోడ్ తీసుకెళ్లాడు. గురువారం ఉదయం సిమెంట్ బస్తాలను అన్‌లోడ్ చేసి, క్లీనర్ రత్నరాజు(32)తో కలిసి తిరిగి జగ్గయ్యపేటకు ప్రయాణమయ్యారు. రాత్రి సుమారు 12 గంటల సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి ఘాట్ రోడ్డుకు చేరుకున్నారు. తురబాడుగెడ్డ సమీపంలో లారీ బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ఘటనలో క్లీనర్ రత్నరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ కొండలు తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించి డ్రైవర్‌ను స్థానికులు డౌనూరు పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి పంపారు. కాగా లారీ బోల్తా పడిన ప్రదేశం రోడ్డు నుంచి చాలా లోతులో వుండడంతో శుక్రవారం సాయంత్రం వరకు లారీలో ఇరుక్కున్న క్లీనర్ మృతదేహాన్ని బయటకు తీయలేదు. శనివారం భారీ క్రేన్‌ను రప్పించి మృతదేహాన్ని బయటకు తీసుకువస్తామని చింతపల్లి పోలీసులు చెబుతున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



మండకుర్తి రవికుమార్ (ఫైల్‌ఫొటో)

డుంబ్రిగుడ, మార్చి 22: మండలంలోని అరకు సంతబయలులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

అరకు సంతబయలు నేరుడువలస గ్రామానికి చెందిన మండకుర్తి రవికుమార్(34) విశాఖలోని ఒక ప్రైవేటు కేంద్రంలో కంప్యూటర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చిన రవికుమార్ తన చెల్లెలి ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ద్విచక్రవాహనంపై మీసేవా కేంద్రానికి బయలుదేరాడు. అక్కడ పని పూర్తయిన తరువాత తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని, ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో రవికుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంటికి వంద మీటర్ల దూరంలోనే ఈ ప్రమాదం జరిగింది. ఘటన గురించి తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు హుటాహుటిన వచ్చి, రవికుమార్ మృతదేహాన్ని చూసి రోదించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని ఎస్ఐ సంతోష్‌కుమార్ చెప్పారు.

హద్దులు దాటి చెట్లు నరికివేత

సగానికిపైగా నిధులు స్వాహా

- బాధ్యులపై చర్యలు తప్పవు
- అటవీ శాఖ రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ హెచ్చరిక
- చింతాలమ్మఘాట్ రోడ్డులో నరికివేసిన చెట్లు పరిశీలన



హద్దులుదాటి నరికిన చెట్ల మొదళ్లను ఫొటో తీస్తున్న డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ

కొయ్యూరు, మార్చి 22: జాతీయ రహదారి నిర్మాణం కోసం నిర్దేశించిన హద్దులు దాటి వృక్షాలు నరికివేశారని, ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని అటవీశాఖ రాష్ట్ర విజిలెన్స్ డీఎఫ్‌వో రవిశంకర్ శర్మ హెచ్చరించారు. రాజమహేంద్రవరం- విజయనగరం (వయా పాడేరు, అరకులోయ) 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం కోసం కొయ్యూరు మండలం చింతాలమ్మఘాట్ రిజర్వు ఫారెస్టులో అనుమతులకు మించి చెట్లు నరికివేసిన ఘటనపై రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య అధికారి(పీసీసీఎఫ్) తీవ్రంగా స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు రవిశంకర్ శర్మతోపాటు రేంజర్ శంకరయ్యల, ఎలమంచిలి సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్, స్క్వాడ్ రేంజర్ గంగరాజు తదితరులు శుక్రవారం చింతాలమ్మఘాట్ రోడ్డు ఇరువైపులా నరికిన చెట్లను పరిశీలించారు. పెదవలస రేంజ్‌లో 30 చెట్లు, కృష్ణాదేవిపేట రేంజ్ పరిధి బంగారమ్మపేట బీట్ పరిధిలో 59 చెట్లు అదనంగా నరికినట్టు గుర్తించారు. అంతేకాక చెట్లు నరికించడానికి మంజూరైన నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మంజూరైన రూ.68 లక్షల్లో సగానికిపైగా స్వాహా చేసినట్టు గుర్తించారు. తరువాత శింగవరం కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన అటవీ కలప డిపోకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎఫ్‌వో శర్మ- సిబ్బందిని విచారించగా.. అనుమతులకు మించి చెట్లు నరకలేదని చెప్పుకొచ్చారు. దీంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనంగా నరికిన చెట్ల కలపను డిపోకు చేర్చి వేలం ద్వారా విక్రయించాలని, వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని కృష్ణాదేవిపేట సిబ్బందిని ఆదేశించారు. తనిఖీ, విచారణకు సంబంధించి తన నివేదిక త్వరలో పీసీసీఎఫ్‌కు అందచేస్తానన్నారు. ఆయన వెంట పెదవలస, కృష్ణాదేవిపేట రేంజర్లు జగదీశ్, వెంకటరావు, రెండు సెక్షన్ల సిబ్బంది, కలప డిపో సిబ్బంది వున్నారు.

చీరల పంపిణీకి వైసీపీ నేతల యత్నం

అడ్డుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్...
46 చీరలు, 3 లంగా ఓణీలు స్వాధీనం

- జడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్‌పై కేసు నమోదు, కారు సీజ్
- అదే వాహన శ్రేణిలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య



జడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ వాహనంలో పట్టుబడిన చీరలు



తనిఖీల సందర్భంగా అక్కడ ఉన్న విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ భార్య

చోడవరం, మార్చి 22: ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు అధికార పార్టీ నాయకులు నానా రకాలుగా యత్నిస్తున్నారు. అనకాపల్లి జిల్లా చోడవరంలో ఓటర్లకు పంచేందుకు వైసీపీ నేతలు తీసుకువెళుతున్న చీరలను శుక్రవారం ఎలక్షన్ స్పెషల్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు కరణం ధర్మశ్రీ భార్య ఒక వాహనంలో, జెడ్పీటీసీ సభ్యురాలు మారిశెట్టి విజయ భర్త శ్రీకాంత్, తదితరులు మరో వాహనంలో శుక్రవారం ఉదయం పట్టణంలోని పెదబజారువీధిలో గల ఓ వ్యాపారి ఇంటికి బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి డి.సురేఖ, ఇతర సిబ్బంది...వైసీపీ నేతల వాహనాలను అడ్డుకుని తనిఖీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలి భర్త శ్రీకాంత్ కారులో ఉన్న 46 చీరలు, 3 లంగా ఓణీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తమ కుటుంబంలో శుభకార్యం కోసం తీసుకువెళుతున్నట్టు ... మిగతా 8వ పేజీలో

దట్టంగా పొగ మంచు



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం కమ్ముకున్న పొగమంచు

పాడేరు(ఆంధ్రజ్యోతి) / చింతపల్లి మార్చి 22: ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిదిన్నర గంటల వరకు పొగ మంచు దట్టంగా కురిసింది. ప్రస్తుతం వేసవి కాలం అయినప్పటికీ రెండు రోజుల నుంచి వాతావరణం చల్లగా వుండి, మంచు పడుతున్నది. చింతపల్లి మండలం చెరువులవేనంలో మంచు అందాలు అలరించాయి. అయితే పర్యాటక సీజన్ ముగియడంతో సందర్శకులు అంతగా రాలేదు.



చెరువులవేనంలో అలరిస్తున్న మంచు అందాలు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.12
సహరి (ఆది)	4.45

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పతకాల పంట

- సత్తా చాటిన కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ విద్యార్థులు
- ఎనిమిది బంగారు, ఒక కాంస్య పతకంతో ఓవరాల్ ఛాంపియన్‌షిప్



రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పసిడి, కాంస్య పతకాలు పొందిన కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ విద్యార్థులు

కొయ్యూరు, మార్చి 22: చిత్తూరులో ఈ నెల 20, 21 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి 10వ అంతర్ జిల్లా అండర్-20 పురుషులు, మహిళల కుస్తీ పోటీల్లో కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ విద్యార్థులు సత్తాచాటారు. ఎనిమిది బంగారు, ఒక కాంస్య పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ నూకరాజు తెలిపారు. పురుషుల ఫెలోషిప్‌కు సంబంధించి 55 కేజీల విభాగంలో పి.బుజ్జిబాబు, 60 కేజీలలో వి.మహేశ్, 65 కేజీల విభాగంలో పి.రమేశ్, 55 కేజీల జీఎస్ విభాగంలో ఎం.రమణబాబు, 63 కిలోల విభాగంలో సీహెచ్ మల్లేశ్ బంగారు పతకాలు సాధించారు. మహిళలకు సంబంధించి 50 కేజీల ఫెలోషిప్‌లో పి.నిర్మల, 53 కేజీల విభాగంలో కె.కేశ్వ, 55 కేజీల విభాగంలో కె.కమల పతకాలు సాధించారు. అండర్-15 బాలికల విభాగంలో జి.నాగలక్ష్మి, కెతబిత, బాలుర ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 22: జాతీయ రహదారిలోని నూకాంబిక ఆలయ ముఖ ద్వారానికి సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందినట్టు ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు తెలిపారు. మునగపాక మండలం తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన ముప్పిడి ఉమామహేశ్వరరావు (23) ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈయన గురువారం సాయంత్రం అనకాపల్లి పట్టణానికి పని మీద ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పని ముగించుకున్న తరువాత స్వగ్రామానికి వెళ్లే సమయంలో అర్ధరాత్రి కావడంతో అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు బాగోలేనందున జాతీయ రహదారి మీదుగా తోటాడకు చేరుకుని అక్కడి నుంచి స్వగ్రామానికి వెళదామని బయలుదేరాడన్నారు. అలా వెళ్తుండగా నూకాంబిక ఆలయ ముఖ ద్వారం సమీపంలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పడంతో పడిపోయాడన్నారు. ఈ ఘటనలో తలకు, నోటికి, ముక్కుకి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సంఘటన తెలుసుకున్న మృతుని అక్క ఎం.కళావతి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదని తెలిపారు.

ఏలేరు కాలువలో పడి మరో యువకుడు..

కశింకోట, మార్చి 22 : మండలంలోని బంగారయ్యపేట గ్రామ సమీపంలో ఉన్న ఏలేరు కాలువలో పడి యువకుడు మృతి చెందాడు. శుక్రవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఏఎస్ఐ కే.ఎ.దొర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుద్దన పవన్‌కుమార్(19) శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఏలేరు కాలువ గట్టుపై నుంచి తన స్నేహితుడితోపాటు, పెంపుడు కుక్కను తీసుకొని వెళుతుండగా ఒక్కసారిగా కుక్క ఉరకడంతో దీంతో పాటు పవన్‌కుమార్ కూడా కాలువలో పడిపోయాడన్నారు. పక్కనే ఉన్న స్నేహితుడు పెద్దగా కేకలు వేయడంతో గ్రామస్థులు వెలికి తీయగా అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందాడని తెలిపారు. మృతుడు తల్లి బుద్దన వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్‌టీఆర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అనుమానాస్పదంగా యువతి మృతి!


అపర్ణ ప్రణీత మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

నర్సీపట్నం, మార్చి 22: మునిసిపాలిటీలోని కొత్త వీధిలో ఓ యువతి అనుమానాస్పదంగా మృతి చెందింది. మృతురాలి తండ్రి ముమ్మిన సుబ్బన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవీధికి చెందిన ముమ్మిన సుబ్బన్న, మహేశ్వరి దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అపర్ణ ప్రణీత (20) ఇంటర్ వరకు చదువుకొని ఇక్కడున్న ఓ మెడికల్ షాపులో పనిచేస్తుంది. శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటి బయట చిన్న పిల్లలతో ఆడుకుంటూ కొంత సమయం తర్వాత పడక గదిలోకి వెళ్లింది. తన పెద్ద కుమార్తె వెళ్లి చూసే సరికి అపర్ణ చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేళాడుతూ కనిపించిందని సుబ్బన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుటాహుటిన ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ కాంతికుమార్, ఎస్ఐ సుధాకరరావు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు.

ప్రియుడే హంతకుడు

» వివాహిత మృతి కేసును ఛేదించిన పోలీసులు

మాడుగుల రూరల్, మార్చి 22 : మండలంలోని లోవ పొన్నవోలులో వివాహిత మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ దామోదరనాయుడు శుక్రవారం తెలిపిన వివరాలివి. లోవ పొన్నవోలు గ్రామానికి చెందిన రెడ్డి భవానీ (28)కి, ఇదే మండలం దిబ్బూరు గ్రామానికి చెందిన చామంతుల మధుతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం భవానీ భర్త ప్రకాశ్‌కు తెలియడంతో ఇంట్లో గొడవలు జరిగేవి. దీంతో తనను పెళ్లి చేసుకోవాలని భవానీ మధును పట్టుబట్టేదని ఎస్ఐ చెప్పారు. ఎలాగైనా ఈమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతో మధు ఈ నెల 17వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ఆమెను ఇంటి సమీపంలోని సరుగుడు తోటలోకి రమ్మని పిలిచి, అక్కడ హత్య చేసినట్టు ఎస్ఐ వివరించారు. డీఎస్పీ అప్పలరాజు, సీఐ స్వామినాయుడు లోతుగా విచారణ జరిపి, మధుయే హత్యచేసినట్టు నిర్ధారించారన్నారు. ఈ మేరకు నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

కాగితలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ విజయ్ కుమార్

నక్కపల్లి, మార్చి 22: మండలంలోని కాగిత గ్రామంలో ఒక ఇంటిలో చోరీ జరిగినట్టు సీఐ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ గ్రామానికి చెందిన పోతంశెట్టి గోవింద్ తమ బంధువుల ఇంటిలో జరిగే వివాహానికి కుటుంబంతో కలిసి గురువారం ఊరెళ్లినట్టు చెప్పారు. శుక్రవారం తిరిగొచ్చేసరికి ఇంటి తలుపులు తెరచివుండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు తలుపు తాళం తెరచి, ఇంట్లోకి వెళ్లి బీరువా పగులగొట్టి, రూ.20 వేలు నగదు పట్టుకుపోయినట్టు పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్, క్లూస్ టీం బృందం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

వైసీపీ జెండా తొలగిస్తుండగా కరెంట్ షాక్

» వీఆర్ఏ, పారిశుధ్య సిబ్బందికి స్వల్ప గాయాలు

ఎస్.రాయవరం, మార్చి 22: మండలంలోని వమ్మవరంలో విద్యుత్ స్తంభానికి ఉన్న వైసీపీ జెండాను తొలగిస్తుండగా వీఆర్ఏ గోరింట్ల వీరదాసు, పారిశుధ్య కార్మికుడు కుందూరు అప్పారావు విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిద్దరిని నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో అక్కడ చికిత్స అందజేసి, ఇంటికి పంపివేశారు. వైసీపీ జెండాను శుక్రవారం నాటి వరకు తొలగించకపోవడానికి గల కారణంపై గ్రామ కార్యదర్శిని ఉన్నతాధికారులు వివరణ కోరడంతో వీటిని తొలగిస్తుండగా ప్రమాదం జరిగింది.

ప్రశాంతంగా టెన్త్ గణితం పరీక్ష

అనకాపల్లి రూరల్, మార్చి 22: జిల్లాలోని పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం గణితం పరీక్షను నిర్వహించినట్టు డీఈవో వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 21,258 మందికి గాను 21,142 మంది హాజరు కాగా.. 116 మంది గైర్హాజరు అయినట్టు చెప్పారు. అలాగే ఈ పరీక్షకు ప్రైవేటు విద్యార్థులు 1,312 మంది హాజరుకావాల్సి ఉండగా 942 మంది హాజరై.. 370 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఆగని వైసీపీ నేతల గ్రావెల్ అక్రమాలు

రాత్రిపూట యథేచ్ఛగా తవ్వకాలు

» మార్టురు ప్రైవేటు వెంచర్‌కు 200 లారీలు తరలింపు
» పట్టించుకోని పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులు
» అనుమతులున్నాయంటూ బుకాయింపు


తుమ్మపాల నుంచి మార్టూరు వెళ్లే జంక్షన్ వద్ద ఒక ప్రైవేటు లేఅవుట్ స్థలంలో గ్రావెల్ వేసిన చిత్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు గ్రావెల్ తవ్వకాలకు జిల్లాను అధికార పార్టీ నాయకులు వేదికగా మార్చుకున్నారు. జిల్లాల పునర్విభజన తరువాత ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో పాగావేసిన గ్రావెల్ మాఫియా అధికార పార్టీ నాయకుల దన్నుతో పదుల సంఖ్యలో అనధికార గ్రావెల్ క్వారీలు నడుపుతున్నా.. అడ్డుకొనే వారే కరువయ్యారు. అనకాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి, కశింకోటతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు భూములతో ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ యథేచ్ఛగా గ్రావెల్ కొల్లగొట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. ఒకవైపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు క్షణం తీరిక లేకుండా ఉండడంతో కొందరు ఇదే అదునుగా భావించి తమను అడిగేవారే లేరనే ధీమాతో యథేచ్ఛగా కొండలను పిండి చేసి జేబులు నింపుకుంటున్నారు. తాజాగా అనకాపల్లి మండలం మార్టూరులో అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వకాలు జరిపి అమ్ముకుంటున్నారు. వాస్తవానికి మార్టురులో ఎవరికి గ్రావెల్ తవ్వకాలకు అనుమతి లేకపోయినా వైసీపీ నాయకులు మాత్రం తమకు అనుమతులు ఉన్నాయంటూ గ్రావెల్ దందాకు పాల్పడుతున్నారు. గడిచిన వారం రోజులుగా ప్రతిరోజు రాత్రిపూట మార్టూరులో గ్రావెల్ తవ్వకాలు జరిపి మార్టూరు కూడలిలో ఒక ప్రైవేటు వెంచర్‌కు లారీలు, టిప్పర్లలో గ్రావెల్ తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఇప్పటికే 200 లారీలకు పైగా గ్రావెల్‌ను తరలించి మూడు ఎకరాల స్థలాన్ని చదును చేశారు. వైసీపీ ప్రజాప్రతినిధి ఒకరు దగ్గరుండి మరీ ఈ వ్యవహారం నడుపుతున్నట్టు చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోగా ప్రతిరోజు తరలిపోతున్న గ్రావెల్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోంది. ఎవరైనా ప్రశ్నిస్తే, అనుమతులు ఉన్నాయి.. అధికారులకు మామూళ్లిచ్చాం.. మీకేంటి అనే ధోరణిలో జవాబిస్తున్నారు. సామాన్యులు గృహ అవసరాలకు ట్రాక్టర్లలో గ్రావెల్ తరలిస్తే అడ్డుకొనే పోలీసులు, గనులు, రెవెన్యూ శాఖాధికారులు ప్రశ్నించకుండా చూసీచూడనట్టు పోతుండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ గ్రావెల తవ్వకాలు, రవాణాకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చిన ఘనత వైసీపీదే

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 22: విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చేసిన ఘనత వైసీపీదేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విశాఖ కేంద్రంగా గంజాయి రవాణా సాగుతుందని కేంద్ర నిఘా వర్గాలు గతంలోనే చెప్పాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో జగన్ మురా పాపాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయన్నారు. విశాఖ తీరంలో బ్రెజిల్ నుంచి తరలిస్తున్న 25 వేల కిలోల డ్రగ్స్ పట్టుబడిందన్న వార్త ఉమ్మడి జిల్లాలను కలవరపరిచిందన్నారు. విశాఖలోని ఒక ప్రైవేటు కంపెనీ పేరుతో ఈ డ్రగ్స్‌ను దిగుమతి చేసుకునే విషయంలో జగన్‌రెడ్డి గ్యాంగ్ ఎంతగా బరితెగిస్తుందో అర్థమవుతుందన్నారు. ప్రశాంతంగా ఉండే విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చేశారని ఆరోపించారు. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్‌కు నిలయంగా విశాఖ మారిందని, పెద్ద సంఖ్యలో యువత తప్పుడు మార్గంలో వెళ్లేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. తక్షణమే డ్రగ్స్ నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన వారిపై చర్యలకు ఉపక్రమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కేకేవీఏ నారాయణరావు, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, మళ్ల గణేష్, గుడాల సత్యనారాయణ, బొడ్డేడ మురళీ పాల్గొన్నారు.

చెరకు కోతలో ఖర్చు తగ్గించేందుకు యాంత్రీకరణ అవసరం

» ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జగన్నాథరావు


చెరకు కోత యంత్రాన్ని పరిశీలిస్తున్న రైతులు, శాస్త్రవేత్తలు

కొత్తూరు, మార్చి 22: రైతులకు ఖర్చు తగ్గించేందుకు చెరకు కోత యాంత్రీకరణ ఎంతో అవసరమని, వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ పీవీకే.జగన్నాథరావు అన్నారు. శుక్రవారం ఆర్ఏఆర్ఎస్‌లో సోలాపూర్ సందర్శించిన రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరకు కోతకు రైతుకు సాధారణంగా టన్నుకు వెయ్యి రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. వోల్కేన్ హార్వెస్టర్ యాంత్రీకరణను రైతులు సమిష్టితో గ్రూపుగా తీసుకున్నట్టయితే కేవలం టన్నుకి రూ.400లు ఖర్చు అవుతుందన్నారు. దీంతో 60శాతం పైబడి ఈ యంత్రం ద్వారా ఖర్చు ఆదా అవుతుందన్నారు. ఈ యంత్రం గంటకి 5 టన్నులు చొప్పున రోజుకి 50 టన్నులు చెరకు గెడ కోయడంతోపాటు గెడపై ఉన్న చెత్తను తొలగిస్తుందన్నారు. ఈ యంత్రం పనితనాన్ని వీక్షించేందుకు సోలాపూర్ వెళ్లి రావడం జరిగిందన్నారు. తమతోపాటు ఆరుగురు రైతులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి తీసుకువెళ్లామన్నారు. ఈ యంత్రం కొనుగోలు చేసేందుకు రూ.35లక్షలు పైబడి ఖర్చు అవుతుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు, ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ యంత్రాన్ని కొనుగోలు చేసి రైతులకు ఖర్చు తగ్గించేందుకు కృషిచేయాలని రైతులు కోరారు. అనంతరం సోలాపూర్‌లో రైతులు సందర్శించిన చిత్రాలను వోల్కేన్ హార్వెస్టర్ చిత్రాలు, యంత్రం పనితనం వీడియోలు ప్రదర్శించారు. ఈ సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.రాజేంద్రప్రసాద్, రైతులు బి. హరికృష్ణ, సన్యాసినాయుడు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత, రక్షణ అంశాలను మ్యానిఫెస్టోలో పెట్టాలి

» ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి


మ్యానిఫెస్టో ప్రదర్శిస్తున్న ప్రభావతి తదితరులు

నర్సీపట్నం, మార్చి 22: మహిళా సాధికారత, రక్షణ అంశాలను ప్రధాన రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడి బాలికల వసతి గృహంలో మ్యానిఫెస్టోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళపై అత్యాచారాలు, హింసను అరికట్టడం, ఒంటరి మహిళలకు ప్రత్యేక గుర్తింపు, బాలల సంక్షేమం అంశాలను రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రతినిధులు ఎల్.గౌరీ, సూర్యప్రభ, ప్రసన్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

అనితపై సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తవం

» లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్


మాట్లాడుతున్న లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్

పాయకరావుపేట, మార్చి 22 : స్థానిక లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత యాజమాన్యాన్ని బెదిరించి రూ.50 లక్షల విలువైన చీరలు తీసుకెళ్లారని సోషల్ మీడియాలో వచ్చిన వార్త పూర్తిగా అవాస్తవమని షాపింగ్ మాల్ ప్రతినిధి జి.రమేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అందరు ఆహ్వానితులతోపాటు అనిత వచ్చి, యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసి వెళ్లారు తప్ప షోషల్ మీడియాలో పేర్కొన్నట్టుగా ఏమీ జరగలేదన్నారు. అదేవిధంగా అనితపై తాము పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు చేయలేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు వార్తను ఎవరూ నమ్మవద్దని కోరారు. అనితపై తప్పుడు వార్తను సోషల్ మీడియాలో పెట్టినవారిపై చర్యలు తీసుకుంటామని లక్కీ షాపింగ్ మాల్ ప్రతినిధి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరరావు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ కిరాతకం

» భార్యకు శిరోముండనం చేసిన కానిస్టేబుల్
» ఆపై హత్యాయత్నం... నిందితుడి అరెస్టు


కానిస్టేబుల్ భవానీ

విశాఖపట్నం, మార్చి 22: భార్య పట్ల అతి కిరాతకంగా ప్రవర్తించాడో కానిస్టేబుల్. శిరోముండనం చేయడంతో పాటు ఆమె కనుబొమ్మలనూ కత్తిరించాడు. ఈ దురాగతానికి పాల్పడిన అనకాపల్లి టౌన్ కానిస్టేబుల్‌ను నగరంలోని నాలుగో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రైల్వే న్యూకాలనీ శివాలయంవీధికి చెందిన జి.జనయత్రిమహాలక్ష్మికి 2013లో తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన గూడుపు భవానీ శంకర్ (38)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భవానీశంకర్ ప్రస్తుతం అనకాపల్లిలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లైన నాలుగో నెల నుంచి భవానీశంకర్ కట్నం కోసం వేధింపులు ప్రారంభించాడు. దీంతో పాటు అనుమానంతో భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీన భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఈ నెల 18న మహాలక్ష్మిని ఆమె కన్నవారింటికి పంపించివేశాడు. మరుసటి రోజు అత్తారింటికి తిరిగి వెళ్లింది. అక్కడ అత్త, ఆడపడుచులు మందలించడంతో మహాలక్ష్మి పుట్టింటికి వచ్చేసింది. ఈ నెల 20వ తేదీన భవానీశంకర్ అత్తారింటికి వెళ్లి కేకలు వేస్తూ దాడికి దిగాడు. ఆమె తప్పించుకుని ఓ గదిలోకి వెళ్లి ఉండిపోయింది. దీంతో భవానీశంకర్ మహాలక్ష్మి సోదరుడి బిడ్డను (14 నెలలు) గట్టిగా పట్టుకుని గదిలో నుంచి రాకుంటే గొంతు నొక్కేస్తానని హెచ్చరించాడు. మహాలక్ష్మి బయటకు రాగా తనతో పాటు తీసుకువెళ్లిన ట్రిమ్మర్‌తో జుట్టును కత్తిరించి గుండు చేశాడు. ఆ తరువాత కనుబొమ్మలను తొలగించాడు. ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మహాలక్ష్మి తండ్రి, స్థానికులు నిలువరించడంతో పారిపోయాడు. ఈ అఘాయిత్యాలపై ఆమె ఫిర్యాదు చేశారు. సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎం.సూర్యారావు కేసు నమోదు చేశారు. వేధింపులు, ఇతర నేరాలకు పాల్పడినందుకు 409ఏ, 307, 506 సెక్షన్ల కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

దువ్వాడ మీదుగా సంత్రాగచ్చి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, మార్చి 22: హోలీ పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకుని వయా దువ్వాడ మీదుగా సంత్రాగచ్చి, సికింద్రాబాద్ మధ్య ఒక ట్రిప్పు ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 07645 నంబరు గల రైలు ఈనెల 23న రాత్రి 9.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.35 గంటలకు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. తిరిగి 07646 నంబరు గల రైలు ఈనెల 25న ఉదయం 5.45 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.35 గంటలకు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.10 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది.

కిరండోల్ రైలు దంతెవాడ వరకే...

భద్రతా కారణాల దృష్ట్యా 18514 నంబరు గల నైట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో 18513 నంబరు గల రైలు ఈనెల 23 నుంచి 31వ తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడపనున్నట్టు సీనియర్ డీసీఎం తిపాఠి తెలిపారు. 08551 నంబరు గల రైలు ఈనెల 22 నుంచి 31వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరిగి 08552 నంబరు గల రైలు ఈ నెల 23 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలు రద్దు చేశామన్నారు.


చంద్రబాబుతో గండి బాబ్జీ, అతని కుమారుడు వంశీ

సముచిత స్థానం కల్పిస్తాం

» గండి బాబ్జీకి చంద్రబాబునాయుడు, నారా లోకేష్ హామీ
» 'సౌత్' ఇన్‌చార్జిగా కొనసాగుతూ జనసేన అభ్యర్థి విజయానికి కృషి చేయాల్సిందిగా సూచన

విశాఖపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తగిన న్యాయం చేస్తామని విశాఖ దక్షిణ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌చార్జి గండి బాబ్జీకి ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. బాబ్జీని, ఆయన కుమారుడిని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ శుక్రవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తీసుకువెళ్లారు. లోకేశ్‌తో సమావేశం ఏర్పాటుచేశారు. గండి బాబ్జీకి సముచిత స్థానం కల్పించాలని శ్రీభరత్ కోరగా లోకేశ్ సానుకూలంగా స్పందిస్తూ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతానికి విశాఖ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ అధ్యక్ష పదవి చేపట్టాలని సూచించగా..అందుకు బాబ్జీ అంగీకరించారు. అదే సమయంలో విశాఖ దక్షిణ ఇన్‌చార్జిగా వ్యవహరించి వచ్చే ఎన్నికల్లో మిత్రపక్షమైన జనసేన అభ్యర్థి గెలుపునకు కృషిచేయాలని లోకేశ్ సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులకు అధిష్ఠానం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సాయంత్రం గండి బాబ్జీ, ఆయన కుమారుడు వంశీ ఇద్దరూ పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని, రానున్న ఎన్నికల్లో మిత్రపక్షం అభ్యర్థి విజయానికి కృషిచేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని విధాలా న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. గండి వంశీ భవిష్యత్తును యవనేత నారా లోకేశ్‌కు అప్పగిస్తానని అన్నారు.

పరీక్షా కేంద్రాల బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ


గాంధీనగరం పరీక్షా కేంద్రంలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 22: పట్టణంలోని పలు పది పరీక్షా కేంద్రాల్లో బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పర్యవేక్షించారు. పట్టణంలోని గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, నరసింగరావుపేటలోని నారాయణ విద్యాసంస్థలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈయన వెంట పట్టణ సీఐ జి.శంకరరావు ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఈవో


కేజీబీవీ బాలికలతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి, మార్చి 22: నక్కపల్లి కేజీబీవీ పాఠశాలను శుక్రవారం మధ్యాహ్నం జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీ సమస్యలు, భోజనం, వసతి సదుపాయాల గురించి ఆరా తీశారు. టెన్త్ పరీక్షలు రాస్తున్న బాలికలతో ఆమె మాట్లాడారు. పరీక్షలు బాగా రాసి, మంచి ఫలితాలు సాధించాలని డీఈవో సూచించారు. ఆమె వెంట ఎంఈవో నరేశ్, కేజీబీవీ ఎస్‌వో సలీమ్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి వున్నారు.

జాతీయ రగ్బీ జట్టుకి అచ్యుతాపురంలో కోచింగ్

» 25వ తేదీ నుంచి భువనేశ్వర్‌లో జాతీయ పోటీలు


రగ్బీ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకునాయుడు

అచ్యుతాపురం, మార్చి 22: జాతీయ స్థాయికి ఎంపికైన రగ్బీ జట్టుకి అచ్యుతాపురంలో కోచింగ్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈనెల 25 నుంచి 30వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జాతీయ స్థాయి రగ్బీ పోటీలు జరగనున్నాయి. రాష్ట్ర జట్టుని ఈనెల 10న గుంటూరులో ఎంపిక చేశారు. జట్టులో 23 మంది క్రీడాకారులకు అచ్యుతాపురంలో మూడు రోజులపాటు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. దీనికి కావలసిన వసతిని స్థానిక సర్పంచ్ భర్త వెంకునాయుడు సమకూర్చారు. ఈ జట్టులో అచ్యుతాపురం పట్టణానికి చెందిన కూండ్రపు నాగ వెంకటరావు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

దుష్ప్రచారంపై ఎన్నికల సంఘానికి అనిత ఫిర్యాదు

నక్కపల్లి, మార్చి 22: పాయకరావుపేటలో ఒక షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి తాను వెళితే వైసీపీ సోషల్ మీడియా పేటీఎం బ్యాచ్, తునికి చెందిన ఒక వలంటీర్ దుష్ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టారని తెలుగుమహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత తెలిపారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్టు ఆమె తెలిపారు. శుక్రవారం ఆమె ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ.. ఆ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి వైసీపీ ప్రజాప్రతినిధులు, పలు పార్టీలకు చెందిన నాయకులు, ఇతర అతిథులు కూడా వచ్చారన్నారు. ఒక్క తనపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టడం వైసీపీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. సంబంధిత వలంటీర్‌తోపాటు, తనపై తప్పుడు పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నట్టు అనిత చెప్పారు. వలంటర్లు వైసీపీ మాయలో పడి ఇటువంటి చర్యలకు పాల్పడినా, ఓటర్లను ప్రలోభపెట్టినా కేసుల్లో ఇరుక్కోవల్సివస్తుందని ఆమె హెచ్చరించారు. ఆ తరువాత ఎటువంటి ఉద్యోగాలకు కూడా పనికిరారన్నారు.

వలంటీర్ల కదలికలపై నిఘా పెట్టండి

మండల అధికారులకు కలెక్టర్, జేసీ ఆదేశం

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


వలంటీర్లతో రహస్య భేటీలు

పాడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి రాజకీయ ప్రచారాల్లో పాల్గొనే గ్రామ వలంటీర్లపై నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, స్థానిక అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట మండల స్థాయి అధికారులను ఆదేశించారు. గ్రామ వలంటీర్లతో వైసీపీ, ఐప్యాక్ టీమ్ సమావేశాలు నిర్వహిస్తున్నాయనే సమాచారంతో 'వలంటీర్లతో రహస్య భేటీలు' అన్న శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనికి జిల్లా ఎన్నికల అధికారి, అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి స్పందించారు. ఈ మేరకు గ్రామ వలంటీర్ల కదలికలపై నిఘా పెట్టాలని, ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు చేపట్టాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదే విషయంపై మండలంలోని గ్రామ సచివాలయాల కార్యదర్శులను ఎంపీడీవో సాయినవీన్ అప్రమత్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వలంటీర్లు కోడ్ ఉల్లంఘించే పనులకు పాల్పడకూడదని హెచ్చరించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం: బీజేపీ నేత కురసా

పాడేరు రూరల్, మార్చి 22: ఎన్‌డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా మూడు పార్టీల శ్రేణులు పనిచేయాలని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత విజయం తథ్యమన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కారణంగా ఎన్‌డీఏ కూటమి బలపర్చిన ఎంపీ అభ్యర్థి గెలుపు నల్లేరుమీద నడకలా సాగుతుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గిరిజన ప్రాంత అభివృద్ధికి కేటాయించిన నిధులు, చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలన్నారు. పీవీటీజీ తెగల అభివృద్ధికి పీఎం జన్‌మన్ పథకం ద్వారా రూ. 22 వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. టీడీపీ, జనసేన పార్టీలకు ప్రజల్లో ఉన్న ఆదరణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేసి ఎన్‌డీఏ కూటమి బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

పీహెచ్‌సీలకు కిట్ల పంపిణీ

గూడెంకొత్తవీధి, మార్చి 22: పీహెచ్‌సీల్లో రోగులకు అవసరమైన కిట్లను హెచ్‌పీ శక్తి మహిళా క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. శుక్రవారం పెదవలస, ఆర్‌వీనగర్ పీహెచ్‌సీలను సందర్శించిన క్లబ్ సభ్యులు వీల్ చైర్, నెబ్యులైజర్, బీపీ, షుగర్ మిషన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు కోమలి, సౌమ్య మాట్లాడుతూ హెచ్‌పీ శక్తి మహిళా క్లబ్ సభ్యులు కిట్లు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఇవి రోగులకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. క్లబ్ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ అంతానికి అందరూ సహకరించాలి

హుకుంపేట, మార్చి 22: క్షయ అంతానికి అందరూ సహకరించాలని వైద్యాధికారి సౌమ్య కోరారు. ఉప్ప, పినకోట పీహెచ్‌సీల్లో శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీని ఓడిద్దాం.. దేశ ప్రజలను కాపాడుదాం.. అని నినాదాలతో ర్యాలీ సాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్షయపై ఎవరూ భయందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీబీ సూపర్‌వైజర్ కె.సదానందం, ల్యాబ్ సూపర్‌వైజర్ నాగేశ్వరావు, కోర్డినేటర్ దనరాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

పాడేరు ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

- చీకట్లో కుటుంబాలతో ప్రయాణికుల ఇబ్బందులు
- ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద సిమెంట్ లారీ ఆగిపోవడమే కారణం



పాడేరు ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద ఆగిన వున్న లారీలు... ఘాట్ రోడ్డులో నిలిపోయినచిన పీటీడీ బస్సులు

పాడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఘాట్ రోడ్డులోని ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద సిమెంట్ లోడుతో ఉన్న లారీ రోడ్డుకడ్డంగా నిలిచిపోవడంతో మూడు గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పిల్లాపాపలతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష సాక్షల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి...

విశాఖపట్నం నుంచి పాడేరుకు సిమెంట్ రేకుల లోడుతో వస్తున్న లారీ శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఘాట్‌లోని ఏసుప్రభు బొమ్మ మలుపు వద్ద అప్పు ఎక్కలేక మలుపునకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ అటుఇటూ కదపడంతో మలుపులో వాహనాల రాకపోకలకు అవకాశం కలిగింది. పగటి వేళల్లో మామూలుగానే వాహనాల రాకపోకలు సాగించాయి. సాయంత్రం ఐదు గంటల సమయంలో మలుపు వద్ద వున్న ఆ లారీని ఎలాగైనా అప్పు ఎక్కించాలనే ప్రయత్నం చేయడంతో ఎక్కలేక మళ్లీ రోడ్డుకడ్డంగా ఆగిపోయింది. దీంతో కార్లు, జీపులు, బైక్‌లు తప్ప లారీలు, బస్సులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. అలాగే సిమెంట్ లారీ సైతం 30 టన్నులు పైబడి లోడుతో ఉండడంతో పాటు రాత్రి వేళ కావడంతో దాన్ని పూర్తిగా తొలగించలేకపోయారు. ఫలితంగా ఘాట్ రోడ్డు కిరువైపులా పదుల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. సుమారు మూడు గంటల పాటు ఘాట్‌లోని వాహనాలు నిలిచిపోవడంతో బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో కుటుంబాలతో ప్రయాణించిన వారంతా తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చివరికి పలువురు డ్రైవర్లు, ప్రయాణికులు కలిసి లారీని పక్కకు తోయడంతో బస్సుల రాకపోకలకు అవకాశం కలిగింది. ఘాట్‌లో వారానికోసారైనా ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు తెలిపారు.

ఈవీఎంల తరలింపునకు పక్కా ఏర్పాట్లు

- అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో అభిషేక్



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్వో అభిషేక్ ... అరకులో ఓటు వినియోగంపై ఓటర్లతో ర్యాలీ చేస్తున్న ఆర్వో, ఎస్డీసీ

పాడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల తరలింపునకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఐటీడీఏ పీవో అభిషేక్ అధికారులకు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, వాటిని తరలించేందుకు చేయాల్సిన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ అరకులోయ అసెంబ్లీ స్థానానికి సంబంధించి ఆరు మండలాల్లోని 304 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలను ఇక్కడి నుంచే తరలిస్తామన్నారు. వాటిని నియోజకవర్గ కేంద్రం అరకులోయకు తరలింపు, పోలింగ్ అనంతరం వాటిని స్వీకరించి, స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు అవసరమైన ఏర్పాట్లును పక్కాగా చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయా అధికారులకు ఆర్వో అభిషేక్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ పి.అనుదీప్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోండి

అరకులోయ, మార్చి 22: ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవాలని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్వో, పీవో వి.అభిషేక్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లు, అధికారులు కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు వివిధ నినాదాలు ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆర్వో అభిషేక్ మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన రోజున ప్రతీ పోలింగ్ కేంద్రంలో రెండు కంపార్టమెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అరకు నియోజకవర్గం పరిధిలో 304 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంప్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు వెంట తీసుకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వీవీఎస్.శర్మ, తహసీల్దార్ సుధాకర్, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు 101 బిందెల పసుపు నీటితో అభిషేకం

పాడేరు టిక్కెట్ టీడీపీకి కేటాయించాలని గిడ్డి ఈశ్వరి, నాయకుల పూజలు


మోదకొండమ్మ ఆలయానికి 101 పసుపు బిందెల నీటితో వెళ్తున్న గిడ్డి ఈశ్వరి, నాయకులు

పాడేరు రూరల్, మార్చి 22: పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ టిక్కెట్‌ను టీడీపీ అభ్యర్థికే కేటాయించాలని కోరుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి చింతలవీధి మోదకొండమ్మ ఆలయంలో 101 పసుపు బిందెల నీటి శుక్రవారం అమ్మవారికి అభిషేకం చేశారు. పార్టీ మహిళలతో కలిసి కుమ్మరిపుట్టులోని ఆమె నివాస గృహం నుంచి చింతలవీధిలోని అమ్మవారి ఆలయం వరకు శుక్రవారం ఉదయం పాదయాత్రగా వెళ్లారు. అనంతరం అమ్మవారికి అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో ఎంతో మంది పార్టీని నమ్ముకొని ఉన్నారన్నారు. పొత్తుల్లో భాగంగా టిక్కెట్‌ను వేరే పార్టీకి కేటాయిస్తే ఈ ప్రాంతంలో సమస్యలపై మాట్లాడే నాథుడే ఉండరన్నారు. గతంలో కూడా పాడేరు టిక్కెట్ ఇతర పార్టీలకు కేటాయించడంతో టీడీపీ కనుమరుగైపోయే పరిస్థితికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసి గెలుపే లక్ష్యంగా నిలబెట్టిన కార్యకర్తలు మనోవేదనకు గురవుతున్నారని ఆమె వివరించారు. అందుకే గిరిజన ప్రజల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మోదకొండమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశామన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌ల మనస్సు మార్చి టిక్కెట్‌ను టీడీపీ అభ్యర్థికే కేటాయించేలా దీవించాలని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


పాడేరు సంతకు చింతపండు తీసుకువచ్చిన మహిళలు

పాడేరు సంతకు కొత్త చింతపండు

- కిలో రూ.40 చొప్పున గిరి రైతుల విక్రయం

పాడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక వారపు సంతకు ఈఏడాది కొత్త చింతపండును గిరి మహిళలకు తీసుకువచ్చారు. తొలివారం కావడంతో కిలో రూ.40 చొప్పున ధరతో గిరిజనులు విక్రయించారు. ఈవారమే కొత్త చింతపండు రావడంతో వర్తకులు సైతం ఎగబడి కొనుగోలు చేశారు. అలాగే వచ్చే వారం నుంచి వారపు సంతలకు చింతపండు పోటెత్తుతుందని రైతులు, వర్తకులు అంటున్నారు. ఇదిలా ఉండగా చింతపండు కొనుగోలు ధరను జీసీసీ ఇంకా నిర్ణయించలేదు.

బాంబ్ స్క్వాడ్ బృందాల విస్తృత తనిఖీలు


కల్వర్టుల్లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

పెదబయలు, మార్చి 22: మండలంలోని అనుమానిత ప్రదేశాల్లో శుక్రవారం బాంబ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కల్వర్టులు, రహదారులు లక్ష్యంగా తనిఖీలు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో మావోయిస్టులు కదలికలపై ప్రజలు తమకు సమాచారం అందించాలని ఈ సందర్భంగా సీఐ రమేష్ కోరారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చీరల పంపిణీకి వైసీపీ నేతల యత్నం

... 5వ పేజీ తరువాయి

వైసీపీ నాయకులు నమ్మించేందుకు యత్నించినప్పటికీ, విచారణలో తేల్చుకోవాలని అధికారులు స్పష్టంచేశారు. అనంతరం వాటిని పోలీసులకు అప్పగించారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు తీసుకువెళుతున్న చీరలను స్వాధీనం చేసుకోవడంతో పాటు శ్రీకాంత్‌కు చెందిన కారును సీజ్ చేసి, అతనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే భార్య ఇతర వైసీపీ నాయకులు ఉన్నప్పటికీ, వారిని వదిలేయడాన్ని విపక్ష నేతలు తప్పుపడుతున్నారు. పట్టపగలే ఓటర్లకు తాయిలాలు పంచేందుకు అధికార పార్టీ నాయకులు బరితెగించడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో పతకాల పంట

... 5వ పేజీ తరువాయి

విభాగంలో జె.దామోదర్, వి.శ్రీనుబాబు, జి.దుర్గా ప్రసాద్ కూడా సత్తా చాటారు. మొత్తం మీద కొయ్యూరు రెజ్లింగ్ అకాడమీ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. వీరందరూ ఈ నెల 26న ఉత్తరప్రదేశ్‌లోని నొయిడాలో జరిగే జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టుగా కోచ్ చెప్పారు. వీరిని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంఈఓ రాంబాబు, తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే టిక్కెట్ టీడీపీకి కేటాయిస్తే గెలుపు సులభం

- అరకు పార్లమెంట్ బీసీ సెల్ అధికార ప్రతినిధి తిరుమలరావు

సీలేరు, మార్చి 22: పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే టిక్కెట్‌ను టీడీపీకి కేటాయిస్తే గెలుపు సులభమవుతుందని టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి నక్కా తిరుమలరావు పేర్కొన్నారు. పొత్తులో భాగంగా ఇక్కడి టిక్కెట్‌ను బీజేపీకి కేటాయిస్తే వైసీపీకి అవకాశం ఇచ్చినట్టవుతుందన్నారు. ఈ విషంలో పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పునరాలోచించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి


గిరిజనులకు సోలార్ లైట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు


సీలేరు, మార్చి 22: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు గిరిజనులు దూరంగా ఉండాలని సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ రెండో కమాండెంట్ సురేష్‌బాబు, జీకే వీధి సీఐ అప్పలనాయుడు సూచించారు. దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని వలసపల్లి గ్రామంలో శుక్రవారం సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగావారు గ్రామంలో గిరిజనుల సమస్యలపై ఆరా తీశారు. గంజాయి సాగు, రవాణా, మావోయిస్టుల కార్యకలాపాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామంలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని, వాటిని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం వలసపల్లి గిరిజనులకు సోలార్ లైట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కెడి సుభీష్, సీలేరు ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

వరల్డ్ పవర్ చాంపియన్ దీపికకు అభినందనలు

- ట్యాబ్, స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థి దీపికకు ఎల్‌ఈడీ ట్యాబ్, స్టడీ మెటీరియల్‌ను అందిస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, మార్చి 22: ఇంగ్లీష్ సామర్థ్యంపై ఇటీవల నిర్వహించిన వరల్డ్ పవర్ చాంపియన్ 2023-2024 రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన మండలంలోని కుమడ పంచాయతీ చీపురుగొంది ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థిని దీపికకు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా జర్రెల పంచాయతీ సర్పంచ్ బి.భాగ్యవతి ఎల్‌ఈడీ ట్యాబ్‌తో పాటు స్టడీ మెటీరియల్, స్కూల్ బ్యాగ్‌ను అందించారు. శుక్రవారం పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థినిని, ఉపాధ్యాయుడు హనుమంతరావును అభినందించారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే పాఠశాలలో ఉన్న సుమారు 19 మంది విద్యార్థులకు ఆమె స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులకు తనవంతు సహకారం అందించేందుకు ఎప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగ్యవతి సేవా సంఘం ప్రతినిధులు సురేష్, పూర్ణారావు, పూర్ణమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెళ్లి కార్డుపై పవన్‌కల్యాణ్ చిత్రం

- గిరి యువకుడి వినూత్న అభిమానం
- సోషల్ మీడియాలో వైరల్

పాడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో సలుగు పంచాయతీ పరిధిలోని కక్కి గ్రామానికి చెందిన ఓ గిరిజన యువకుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తనకున్న అభిమానాన్ని వినూత్నంగా ప్రదర్శించారు. ఈ ఏడాది ఏప్రిల్ మూడో తేదీన కక్కి గ్రామానికి చెందిన యువకుడు మాసాడ చిన్నారావు అనే యువకుడికి పెళ్లి జరగనుంది. ఈ క్రమంలో ముద్రించిన పెళ్లి కార్డుపై ఓ వైపు పవన్‌కల్యాణ్ చిత్రాన్ని వేయించి, జనసేనానిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. దీంతో ఆ పెళ్లి కార్డు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. అలాగే పవన్‌పై చిన్నారావుకు ఉన్న అభిమానాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు.

సంక్షిప్తంగా..

'పది' పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన ఐటీడీఏ పీవో

అరకులోయ, మార్చి 22: పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ శుక్రవారం మండలంలోని కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. అన్ని గదుల్లోకి వెళ్లి పరీక్ష నిర్వహణ తీరు, కేంద్రంలో సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చీఫ్ ఎగ్జామినర్, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు నియమించిన సిబ్బంది, పరీక్షలు రాసే విద్యార్థులను తప్ప ఇతరులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. విద్యార్థులు పరీక్ష రాసే గదుల్లో తగిన వెలుతురు వుండేలా విద్యుద్ దీపాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట పరీక్ష నిర్వాహకులు (డిపార్ట్‌మెంటల్ చీఫ్ కెందూ, ఎంఈవో-2 భారతీరత్నం, ఏటీడబ్ల్యూఓ మల్లికార్జునరావు వున్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే విధుల్లో తొలగిస్తాం


మాట్లాడుతున్న ఎంపీడీవో జయఉమ

డుంబ్రిగుడ, మార్చి 22: ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జయఉమ హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే నిబంధనల మేరకు తక్షణమే విధులు నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని ఆమె హెచ్చరించారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

గూడెంకొత్తవీధి, మార్చి 22: గ్రామ వలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులతో కలిసి తిరిగినా, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ పాపారావు, ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

6 నుంచి నూకాలమ్మ ఉత్సవాలు

సీలేరు, మార్చి 22: సీలేరు జల విద్యుత్ కేంద్రం సమీపంలోని నూకాలమ్మ ఉత్సవాలు వచ్చే నెల 6వ తేదీ నుంచి జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ గౌరవ అధ్యక్షుడు బి.రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 6న అమ్మవారి గరగల అలంకరణతో ఉత్సవాలు ప్రారంభించి, 8న అమ్మవారి ప్రధాన పండగ నిర్వహిస్తారు. అదే రోజు అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించాలని తీర్మానించారు. అలాగే 10వ తేదీ వరకు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కోశాధికారిగా కె.సన్యాసిరావు, కార్యదర్శిగా సిహెచ్.రాము, పలువురు కార్యవర్గ సభ్యులను నియమించారు. సమావేశంలో సర్పంచ్ కె.దుర్గ, ఉప సర్పంచ్ కె.వల్లీప్రసాద్, డీసీసీ కార్యదర్శి కారే శ్రీనివాస్, సీఐటీయూసీ నేతలు కె.విష్ణుకుమార్‌రాజు, గణేష్ పాల్గొన్నారు.

ధారాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

సీలేరు, మార్చి 22: గూడెంకొత్తవీధి మండలంలోని ధారాలమ్మ ఘాట్ రోడ్డులో కొలువైన ధారాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని లెక్కింపు శుక్రవారం లెక్కించారు. రెండు నెలలకుగాను రూ.2.04 లక్షల ఆదాయం వచ్చింది. అమ్మవారి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ముందుగా హుండీని లెక్కించినట్టు ఆలయ ఈవో సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో ధారకొండ గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి

ముంచంగిపుట్టు, మార్చి 22: మండలంలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలని ఎస్ఐ కె.రవీంద్ర కోరారు. మండలంలో దొంగతనాలు జోరుగా జరుగుతుండడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. అలాగే పలు ఇళ్లల్లో సోదాలు చేశారు. గ్రామ శివార్లలో ఇళ్లకు వెళ్లి రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అనుమానం వచ్చినా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. రేయింబవళ్ల గస్తీ నిర్వహిస్తున్నామని, ఎవరూ భయపడొద్దని ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం

సీలేరు, మార్చి 22: జీకే వీధి మండలం సీలేరు శివాలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీలేరు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు

కొయ్యూరు, మార్చి 22: మండలంలోని మాకవరం పంచాయతీ పిట్టచలం గ్రామంలో శుక్రవారం నాటుసారాతో ఓ వ్యక్తి పట్టుబడినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పిట్టచలం గ్రామంలో నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నట్టు అందిన సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం సిబ్బందితో దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో నాటుసారా విక్రయిస్తూ అదే గ్రామానికి చెందిన కిలో అచ్చిరాజు పట్టుబడ్డాడని, అతన్ని అరెస్టు చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

ఓటర్లకు ఐడీ కార్డుల పంపిణీ

చింతపల్లి, మార్చి 22: ఓటర్లకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్నట్టు తహసీల్దార్ టి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని 78 పోలింగ్ కేంద్రాల పరిధిలోని 10,206 మందికి బీఎల్‌వోలు ఓటరు ఐడీలు పంపిణీ చేశారన్నారు. మండలంలోని ఓటర్లందరికీ పంపిణీ చేయడానికి ఐడీ కార్డులు సిద్ధంగా వున్నాయన్నారు. బీఎల్‌వోల ద్వారా వీటిని అందజేస్తున్నామని, ఓటర్లు వారి దగ్గర పొందాలని సూచించారు. ఈ కార్డుల ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.